

విజయం 'పది'లం చేసుకోండి

ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమైతేనే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. ఈ నెల 3 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 8లో▸




ప్రైవేటే దిక్కు..!

మారుమూల గ్రామాలకు ఆర్టీసీ సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. 9లో▸

గరిష్టం/కనిష్టం
37.5/22.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం భానుడి తీవ్రత అధికంగా ఉంటుంది. గాలిలో తేమ పెరిగి ఉక్కపోతగా అనిపిస్తుంది.



న్యూస్‌రీల్

3న స్థాయీ సంఘాల సమావేశం

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో ఈ నెల 3న ఉదయం 11 గంటలకు స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో రత్నమాల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పనుల స్థాయీ కమిటీ, ప్రణాళిక కమిటీ, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్యా, వైద్యం, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం తదితర అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి గౌరవ సభ్యులు, సంబంధిత శాఖ అధికారులు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఒకేషనల్‌ పరీక్షలు



పరిశీలిస్తున్న డీఐఈవో శ్రీధర్‌ సుమన్‌

ఆసిఫాబాద్‌: జిల్లాలో ఇంటర్మీడియెట్‌ ఒకేషనల్‌ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన ప్రథమ సంవత్సరం పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 649 మంది విద్యార్థులకు 570 మంది హాజరు కాగా, 79 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో శ్రీధర్‌ సుమన్‌ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శ కళాశాలను డీఈసీ బృందం సభ్యులు తనిఖీ చేశారు. పరీక్షల నివేదికను ఇంటర్‌ బోర్డుకు సకాలంలో పంపినట్లు డీఐఈవో పేర్కొన్నారు.

జాబ్‌మేళాలో 52 మంది ఎంపిక

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 52 మంది ఎంపికైనట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి రవికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లిప్‌కార్ట్‌ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 60 పోస్టులకు 71 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఫ్లిప్‌కార్ట్‌ కంపెనీ ప్రతినిధులు 69 మందిని ఇంటర్వ్యూ చేసి 52 మందిని ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



జిల్లా కేంద్రంలో క్షీరాభిషేకం చేస్తున్న సీఆర్టీలు

ఆసిఫాబాద్‌: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలు శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌ చౌక్‌లో సీఎం కేసీఆర్‌, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఇక నుంచి సీఆర్టీలకు 12 నెలల వేతనం చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కారానికి స్పందించిన మంత్రి సత్యవతి రాథోడ్‌, ఎమ్మెల్యే జోగు రామన్న, పీఆర్‌టీయూ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్‌ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మణెమ్మకు స్వీట్లు అందించారు. కార్యక్రమంలో సీఆర్టీల సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్‌, ప్రధాన కార్యదర్శి విజేశ్‌, సభ్యులు అడె ప్రకాశ్‌, భీమేశ్‌, ప్రవీణ్‌, మధునయ్య, హనుమంత్‌, శ్రీనివాస్‌, రజిత, కమలాకర్‌ పాల్గొన్నారు.

వారసంత వేలం

వాంకిడి(ఆసిఫాబాద్‌): మండల కేంద్రంలో ప్రతీ గురువారం నిర్వహించే వారసంతకు శుక్రవారం వేలం నిర్వహించారు. తేజాపూర్‌కు చెందిన ఆడె కమలాకర్‌ 2023– 24 ఆర్థిక సంవత్సరంలో వారసంత నిర్వహణను రూ.9,87,500లకు దక్కించుకున్నారు. కాగా గతేడాది వారసంత వేలం ద్వారా పంచాయతీకి రూ.8.65 లక్షల ఆదాయం సమకూరింది. సర్పంచ్‌ బండె తుకారాం, పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ పాల్గొన్నారు.



కెరమెరి మండలం భోలాపటార్‌లో సీసీరోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి

నాలుగేళ్లుగా నిరీక్షణ!

గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణలో జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. అయితే వీరి ఉద్యోగ భద్రతపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నాలుగేళ్లుగా క్రమబద్ధీకరణ కోసం వేచిచూస్తున్నారు.

- క్రమబద్ధీకరణకు నోచుకోని జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు
- ఏప్రిల్‌ 11తో నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌ పూర్తి
- అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- జిల్లాలో 221 మంది జేపీఎస్‌లు

కెరమెరి(ఆసిఫాబాద్‌): తెలంగాణ ఏర్పాటు తర్వాత పల్లెల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీని కోసం ప్రత్యేకంగా పల్లెప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతోంది. జాతీయ, రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ పురస్కారాల్లోనూ పల్లెలు సత్తా చాటుతున్నాయి. అయితే పల్లె ప్రగతి కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషించే జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులకు మాత్రం నిరాశే మిగులుతోంది. క్షేత్రస్థాయిలో తీవ్రంగా శ్రమిస్తున్న తమను వెంటనే రెగ్యులర్‌ చేయాలని జేపీఎస్‌లు ఆందోళన బాట పడుతున్నారు.

విధుల్లో 221 మంది జేపీఎస్‌లు

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 221 మంది జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు, 61 మంది ఓపీఎస్‌, 53 మంది రెగ్యులర్‌ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. జేపీఎస్‌ల నియామక సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల ప్రొబేషనరీ కాలాన్ని విధించింది. ఈ మేరకు అభ్యర్థుల నుంచి ఒప్పంద పత్రాలు సైతం తీసుకుంది. పనితీరు ఆధారంగా రెగ్యులర్‌ చేస్తామని ప్రకటించింది. 2022 ఏప్రిల్‌తోనే మూడేళ్ల కాల పరిమితి ముగిసింది. దీంతో జేపీఎస్‌ల ప్రొబేషన్‌ కాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం జీవో 26ను విడుదల చేసింది. అలాగే వేతనాన్ని రూ.15 వేల నుంచి రూ.28,719కి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగో ఏడాది ప్రొబేషనరీ పీరియడ్‌ సైతం ఏప్రిల్‌ 11తో పూర్తికానుంది. ఈ క్రమంలో వివిధ కారణాలతో ఖాళీలు అయిన చోట మెరిట్‌ జాబితాలోని మిగిలిన అభ్యర్థులను ఔట్‌సోర్సింగ్‌ పద్ధతిలో నియమించారు.

నాలుగేళ్ల సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలి



జూనియర్‌ పంచాయతీ కార్యదర్శుల నాలుగేళ్ల సర్వీసును రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పటికే జిల్లాలో సుమారు ఆరుగురు జేపీఎస్‌ వివిధ ప్రమాదాల్లో మృత్యువాత పడ్డారు. బాధిత కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి. ప్రభుత్వం వెంటనే తమను రెగ్యులర్‌ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలి.

– బండారి మల్లేశ్‌, జేపీఎస్‌ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు

పనిభారంతో సతమతం..

2019లో టీఎస్‌పీఎస్సీ ద్వారా నియామకమైన వారికి మొదట రూ.15వేల వేతనం అందించారు. ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేసి పేస్కేల్‌ అమలు చేస్తే వీరికి వేతనాల పెంపు ఉండేది. అయితే ప్రభుత్వం నుంచి వారికి నిరాశే ఎదురువుతోంది. మరోవైపు గ్రామ పంచాయతీల్లో రోజువారీ పనిభారంతో జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు సతమమవుతున్నారు. కొత్త పంచాయతీరాజ్‌ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత జీపీల్లో సర్పంచులు, కార్యదర్శులే జవాబుదారీగా మారారు. పల్లె ప్రగతి కార్యక్రమంతోపాటు పల్లె ప్రకృతివనాలు, వైకుంఠధామాలు, పన్నుల వసూళ్లు, పారిశుధ్య నిర్వహణ, క్రీడా ప్రాంగణాలు, నర్సరీలు, డంపింగ్‌ యార్డులు, సెగ్రిగేషన్ల షెడ్ల నిర్వహణ వీరి ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ఉదయం ఏడు గంటలకే పంచాయతీల్లో ఉండాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. కఠినమైన ఆంక్షలతో మహిళా కార్యదర్శులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏ ప్రభుత్వ శాఖలోనైనా రెండేళ్ల ప్రొబేషనరీ మాత్రమే ఉంటుందని, నాలుగేళ్లుగా విధుల్లో ఉన్న తమను వెంటనే రెగ్యులర్‌ చేయాలని జూనియర్‌ పంచాయతీ కోరుతున్నారు.

పోడు పట్టాల పంపిణీకి సిద్ధంగా ఉండాలి



ఆర్డీవో కార్యాలయంలో జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే

- కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే
- అర్హుల జాబితా పరిశీలన

ఆసిఫాబాద్‌: తెలంగాణ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం చేపట్టిన పోడు భూముల పట్టాల పంపిణీకి అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో భద్రపరిచిన పోడు దరఖాస్తులు, ఎస్‌డీఎల్‌సీ కమిటీ ఆమోదించిన పోడు పట్టాల జాబితాను శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపిణీకి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి మణెమ్మ, ఆర్డీవో రాజేశ్వర్‌, అధికారులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యమందించాలి

ఆసిఫాబాద్‌: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని వార్డులు, ప్రసూతి వార్డు, రిజిస్టర్‌ను పరిశీలించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చేవారితో మర్యాదగా ప్రవర్తించాలని, గర్భిణులు ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరుపుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. ఫిబ్రవరిలో 28, మార్చిలో 21 ప్రసవాలు జరిగాయని తెలిపారు. త్వరలో ప్రభుత్వ వైద్యకళాశాల ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా ఆస్పత్రిలో 330 పడకలు ఏర్పాటు చేసి, వార్డుల వారీగా వసతులు కల్పిస్తామన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయ గోదాములో నిల్వ ఉన్న మందులను రెండు రోజుల్లో అన్ని పీహెచ్‌సీలకు సరఫరా చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీసీహెచ్‌ డాక్టర్‌ స్వామి, వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌ నాగార్జున చారి తదితరులు ఉన్నారు.

'పది' పరీక్షలు సజావుగా నిర్వహించాలి

ఆసిఫాబాద్‌: అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పదో తరగతి వార్షిక పరీక్షలు సజావుగా నిర్వహించాలని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో అదనపు కలెక్టర్‌ రాజేశం, డీఈవో అశోక్‌తో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్ష నిర్వహణకు జిల్లావ్యాప్తంగా 39 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 7,151 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాలు, చీఫ్‌ సూపరింటెండెంట్‌ గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా తమకు కేటాయించిన విధులు నిర్వర్తించాలన్నారు. ఏప్రిల్‌ 3 నుంచి 13 వరకు వార్షిక పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగు నీరు, ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులు అకస్మాత్తుగా అనారోగ్యానికి గురైతే చికిత్స అందించేందుకు వీలుగా అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులు సమయానికి ముందే కేంద్రాలకు చేరుకునేవిధంగా అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్‌ అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరీక్షల కోఆర్డినేటర్‌ ఉదయబాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే

సేవలందించి.. 'ప్రతిభ' కనబర్చి



సర్పంచ్‌ ప్రతిభ వెంకటేశ్వర్‌కు అవార్డు అందిస్తున్న మంత్రి కేటీఆర్‌, పక్కన జిల్లా అధికారులు

- ఉత్తమ గ్రామ పంచాయతీగా మార్లవాయి
- మంత్రి కేటీఆర్‌ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సర్పంచ్‌ ప్రతిభ వెంకటేశ్వర్‌

కెరమెరి(ఆసిఫాబాద్‌): మహిళా సర్పంచ్‌గా పంచాయతీని ముందుండి నడిపించింది.. ఆదివాసీ పల్లెలను అభివృద్ధి పథంలో నిలిపింది.. ఆమె కృషికి ఫలితంగా పంచాయతీ రాష్ట్రస్థాయి అవార్డును సొంతం చేసుకుంది. జైనూర్‌ మండలం మార్లవాయి గ్రామ పంచాయతీ రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపిక కాగా, హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ చేతుల మీదుగా సర్పంచ్‌ ప్రతిభ అవార్డును స్వీకరించారు. నేషనల్‌ పంచాయతీ అవార్డులు 2021–22లో భాగంగా పేదరిక నిర్మూలన, మౌలిక సదుపాయల కల్పన, జీవన ప్రమాణాల పెంపుదల విభాగంలో దీన్‌ దయాళ్‌ ఉపాధ్యాయ్‌ పంచాయత్‌ సతత్‌ వికాస్‌ పురస్కార్‌కు మార్లవాయి పంచాయతీ ఎంపికైంది. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్‌, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మల్లారెడ్డి పలు విభాగాల్లో పంచాయతీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మార్లవాయి సర్పంచ్‌ ప్రతిభ వెంకటేశ్వర్‌ను శాలువతో సత్కరించి, ప్రశంసాపత్రం, మెమొంటో అందజేశారు. పంచాయతీ అభివృద్ధి రూ.20 లక్షలు త్వరలోనే మంజూరు చేస్తామని కేటీఆర్‌ ప్రకటించారు. జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన జీపీలకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున రూ.30లక్షలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ అవార్డుల ప్రదానోత్సవంలో అదనపు కలెక్టర్‌ చాహత్‌ బాజ్‌పాయ్‌, డీఆర్‌డీవో సురేందర్‌, జిల్లా పంచాయతీ అధికారి రమేశ్‌, జైనూర్‌ ఎంపీడీవో ప్రభుదయ, పంచాయతీ కార్యదర్శి మనోజ్‌ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే దేశాభివృద్ధి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- వాంకిడిలో ఆత్మీయ సమ్మేళనం
- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్‌ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్‌ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు

వాంకిడి(ఆసిఫాబాద్‌): బీఆర్‌ఎస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. వాంకిడి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన బీఆర్‌ఎస్‌ ఆత్మీయ సమ్మేళనానికి జెడ్పీ చైర్‌పర్సన్‌ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి హాజరయ్యారు. కోనప్ప మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకువస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. నాయకులు, కార్యకర్తలు సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడితే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. కులమతాల మధ్య చిచ్చుపెడుతూ విద్వేశాలను రెచ్చగొడుతున్న బీజేపీ జిమ్మిక్కులను నమ్మొద్దని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. అటవీశాఖ అనుమతుల పేరిట జిల్లాలో నిలిచిన రహదారుల పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. త్వరలోనే పోడు పట్టాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం యోచిస్తుందని తెలిపారు. అనంతరం పంచాయతీల వారీగా నెలకొన్న సమస్యలను సర్పంచుల నుంచి రాతపూర్వకంగా తీసుకున్నారు. త్వరలోనే సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఎంపీపీ విమలబాయి మండలంలో వేల సంఖ్యలో యువత ఉపాధి లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలని జెడ్పీ చైర్‌పర్సన్‌, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అజయ్‌కుమార్‌, ఆసిఫాబాద్‌ మార్కెట్‌ చైర్మన్‌ గాదివేణి మల్లేశ్‌, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్‌ కనక యాదవ్‌రావ్‌, జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌ రావు, పీఏసీఎస్‌ చైర్మన్‌ పెంటు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెంచికల్‌పేట్‌(సిర్పూర్‌): చిరు ధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా శిశు సంక్షేమ అధికారి సావిత్రి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పోషణ్‌ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఫుడ్‌ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలతో రోగాలకు దూరంగా ఉండవచ్చన్నారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు, చిన్నారులు రాగులు, కొర్రలు, జొన్నలు, మినుములు, పెసర్లు, కందులు, శనగలతో చేసిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. తద్వారా రక్తహీనత, పోషకాహార లోపం నివారించవచ్చని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార ప్రాముఖ్యతపై ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. అనంతరం ఫుడ్‌ ఎగ్జిబిషన్‌లో తయారు చేసిన వంటకాలను రుచిచూసి బహుమతులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ సరిత, ఎంపీడీవో గంగాసింగ్‌, ఎస్సై విజయ్‌కుమార్‌, సర్పంచులు కళావతి, సుధాకర్‌, ఎంపీటీసీ రాజన్న, కోఆప్షన్‌ సభ్యుడు సాజీద్‌, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ హసీన, పంచాయితీ కార్యదర్శులు రాకేశ్‌, చంద్రశేఖర్‌, ఏఈవో లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



ఫుడ్‌ ఎగ్జిబిషన్‌లో మాట్లాడుతున్న పీడీ సావిత్రి

మట్టిపాత్రల తయారీకి తోడ్పాటు

రెబ్బెన(ఆసిఫాబాద్‌): ఆధునిక పద్ధతిలో మట్టి పాత్రల తయారీని ప్రోత్సహించేందుకు భారతీయ యువశక్తి ట్రస్ట్‌(భువనేశ్వర్‌) ఆధ్వర్యంలో తగిన తోడ్పాటును అందిస్తామని ట్రస్ట్‌ సభ్యులు తెలిపారు. రెబ్బెన మండలం కైరిగాంలో జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి పాత్రల తయారీ శిక్షణ శిబిరాన్ని జిల్లా టూరిజం అధికారి రామకృష్ణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నూతన మట్టి పాత్రల తయారీ విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మట్టి పాత్రల తయారీని కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకునేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఎలక్ట్రికల్‌ యంత్రాలు, ఇతర అవసరాలకు సబ్సిడీపై రుణాలను మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే తయారు చేసిన మట్టిపాత్రలకు ట్రస్ట్‌ ఆధ్వర్యంలో మార్కెటింగ్‌ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఫ్లిప్‌కార్ట్‌, అమెజాన్‌ వంటి కంపెనీలతో అనుసంధానమై కుమ్మరులు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటునందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కుమ్మరి మల్లేశ్‌, మాస్టర్‌ రమేశ్‌, నాయకులు సంతోష్‌, శంకర్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం



లగ్గాంలో ఇంటిపై విరిగిపడిన చెట్టు

దహెగాం(సిర్పూర్‌): దహెగాం మండల కేంద్రంతోపాటు లగ్గాం, కమ్మర్‌పల్లి, మత్రిపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం అకాల వర్షం కురిసింది. మధ్యాహ్నం ఓ వైపు ఎండ ఉండగానే మేఘాలు కమ్ముకుని రాళ్లవాన పడింది. గాలివానకు లగ్గాం గ్రామంలో అవునూరి రమేశ్‌ ఇంటిపై చెట్టు విరిగిపడటంతో స్వల్పంగా ఇల్లు దెబ్బతింది. మండలంలో అత్యధికంగా సాగవుతున్న మిర్చి పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

విరిగిన విద్యుత్‌ స్తంభాలు

పెంచికల్‌పేట్‌(సిర్పూర్‌): పెంచికల్‌పేట్‌ మండలంలో శుక్రవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. గాలిదుమారం ప్రభావంతో పలువురి ఇళ్ల కప్పులు లేచిపోయాయి. మరో వైపు రెండు విద్యుత్‌ స్తంభాలు విరగడంతో తీగలు తెగి కింద పడ్డాయి. ఆ సమయంలో ఆరుబయట ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్‌ శాఖ అధికారులు పరిశీలించి, మరమ్మతులు చేపట్టారు.



ఎల్కపల్లిలో ఇంటిపై విరిగిపడిన విద్యుత్‌స్తంభం

క్లుప్తంగా

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్


రాళ్లు రువ్వుతున్న మతిస్థిమితం లేని వ్యక్తి

దండేపల్లి: మండల కేంద్రంలో కొద్దిరోజులుగా తిరుగుతున్న ఓ మతి స్థిమితం లేని వ్యక్తి శుక్రవారం జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో బండరాళ్లు విసురుతూ హల్‌చల్ చేశాడు. అటుగా వెళ్లిన విద్యార్థులు, వాహనదారులను భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోగా పిల్లలు పరుగులు తీశారు. కొద్దిసేపటి తర్వాత ఆ వ్యక్తి వెళ్లిపోగా వాహనదారులు ఊపిరి పీల్చుకుని ముందుకు కదిలారు. మతిస్థిమితం లేని వ్యక్తితో పిల్లలు పెద్దలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి అతడిని ఆస్పత్రికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

సింగరేణి నేపథ్యంలో సినిమా


మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు, పక్కన డైరెక్టర్ అశోక్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సింగరేణి ఇతివృత్తంగా మంచిర్యాల జిల్లా పరిసర ప్రాంతాల్లోనే ఓ సినిమా నిర్మిస్తామని ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ప్రముఖ నిర్మాత, బీఆర్‌ఎస్ నాయకుడు పుస్కూరి రామ్మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం మంచిర్యాలలోని తన నివాసంలో డెరెక్టర్ జీ అశోక్‌తో కలిసి చిత్రానికి సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. సింగరేణి నేపథ్యంతో మంచిర్యాల పరిసర ప్రాంతాల్లోని ఓ సినిమా తీయాలనే ఆలోచనతో కథ సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు. బొగ్గుగనుల సీన్ల షూటింగ్ నిమిత్తం శ్రీరాంపూర్ ఓసీపీ, పరిసర ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. వచ్చే రెండు నెలల్లో కొత్త సినిమా చిత్రీకరణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. దర్శకుడు అశోక్ గతంలో పిల్లజమీందార్, భాగమతి తదితర సినిమాలకు దర్శకత్వం వహించారని చెప్పారు.

పేకాట స్థావరంపై దాడి

చెన్నూర్‌రూరల్: నాగాపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. పట్టణ సీఐ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.. నాగాపూర్ శివారులో పేకాడుతున్నవారిని పట్టుకుని రూ.26, 470 నగదు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో ఎస్సై మహేందర్, సిబ్బంది రాజశేఖర్, భూమన్న, రవితో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు తెలిపారు.

టీఎస్‌జీఆర్‌ఈఏ జిల్లా స్థాయి సమావేశం

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం (టీఎస్‌జీఆర్‌ఈఏ) మంచిర్యాల జిల్లా స్థాయి మూడో కార్యవర్గ సమావేశాన్ని సంఘం అధ్యక్షుడు డీ కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈహెచ్‌ఎస్‌కు సంబంధించి పెన్షనర్లకు కంట్రిబ్యూషన్ నిర్ణయించాలన్నారు. టీఎస్‌జీఆర్‌ఈఏ ప్రతినిధులతో కలుపుకొని కమిటీ ఏర్పాటు చేసి సాధ్యమైనంత తొందరగా అమలు జరిగేలా చూడాలన్నారు. పెండింగ్ బిల్లులను తక్షణమే అమలు చేయాలన్నారు. రాష్ట్ర జాయింట్ స్టాఫ్‌కౌన్సిల్‌లో టీఎస్‌జీఆర్‌ఈఏ రాష్ట్ర బాధ్యులకు సభ్యత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి జగన్ పాల్గొన్నారు.

విజయం 'పది'లం చేసుకోండి



నెన్నెల హైస్కూల్‌లో తరగతిగదిలో చదువుతున్న విద్యార్థులు

- ఈ నెల 3వ తేదీ నుంచి ఎస్సెస్సీ పరీక్షలు
- హాజరుకానున్న 36,953 మంది విద్యార్థులు
- పౌష్టికాహారం, సరిపడా నిద్ర తప్పనిసరి.. భయం వీడాలంటున్న వైద్య నిపుణులు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మంచిర్యాల జిల్లాలో 10,125, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 7,051, నిర్మల్‌లో 9,078, ఆదిలాబాద్ జిల్లాలో 10,699 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్షల వేళ విద్యార్థులు ఒత్తిడి.. భయం.. ఆందోళనను జయించాలంటే సానుకూలమైన ఆలోచనలు.. ప్రణాళిక బద్ధమైన సంసిద్ధత, ఆత్మవిశ్వాసం, విషయాన్ని సూటిగా స్పష్టంగా వ్యక్తీకరించడం అవసరం. మానసిక ప్రశాంతత.. ప్రణాళిక ప్రకారం సాధన చేయడం, మంచి ఆహారపు అలవాట్లు, సంపూర్ణ ఆరోగ్యంతో పరీక్షలకు సిద్ధమైతే విజయం సొంతమై లక్ష్యాన్ని చేరుకుంటారు. ఈనేపథ్యంలో వైద్యులు, పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

భయం వీడి పరీక్ష రాయండి



తల్లిదండ్రులు పిల్లలకు పౌష్టికాహారం అందించాలి. పిల్లలను టీవీలకు దూరంగా ఉంచాలి. విద్యార్థులు భయం వీడి పరీక్ష రాయాలి. సంవత్సరం పాటు నేర్చుకున్న విషయాలను మాత్రమే సమాధాన పత్రంలో రాస్తామన్న భావనతో ఉండాలి. ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా పరీక్షలకు హాజరు కావాలి. నిర్దేశించిన సమయానికి గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకుంటే మంచిది.

– ఎస్.వెంకటేశ్వర్లు, డీఈవో, మంచిర్యాల

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పరీక్ష కేంద్రం లోపలికి వెళ్లిన దగ్గరి నుంచి పరీక్ష రాసి తిరిగి వచ్చేవరకూ విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఒకటికి రెండుసార్లు ఆలోచించి ప్రశ్నలకు జవాబులు రాయాలి. పరీక్షల వేళ టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి. పిల్లలు ఏమి చదువుతున్నారనే విషయాన్ని తల్లిదండ్రులు ఓ కంట కనిపెడుతూ ఉండాలి.

– బాపు, పేరెంట్

ఆహారం విషయంలో నిర్లక్ష్యం వద్దు



పరీక్షల ధ్యాసలో పడి ఆహారం విషయంలో నిర్లక్ష్యం చేయరాదు. కూరగాయలు, పప్పుదినుసులు, పాలు, ఆకుకూరలు, పీచు పదార్థాలు ఉండే పండ్లు తినాలి. కాఫీలు, కూల్‌డ్రింక్స్, తేనీరు ఎక్కువగా తీసుకోకూడదు. రోజుకు 8గంటల నిద్రపోవడం ఎంతో ముఖ్యం. ఆయిల్, మసాలతో కూడిన ఆహారం తినరాదు. మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లు, బట్టర్‌మిల్క్ తీసుకోవాలి. రోజుకు 4–5 లీటర్ల నీళ్లు తాగాలి. వదులుగా ఉండే లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలి.

– డాక్టర్ రవికుమార్, జనరల్ ఫిజీషియన్ (ఎండీ)

ఒత్తిడిని జయించేందుకు భరోసానివ్వాలి



పరీక్షలు అనగానే విద్యార్థులు ఒత్తిడికి లోనవుతుంటారు. ధ్యానం, యోగా చేయాలి. ఆరోగ్యకరమైన అలవాట్లు కలిగి ఉండాలి. విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భరోసా కల్పించాలి. స్థాయికి మించిన అంచనాలు పక్కన పెట్టాలి. సానుకూల దృక్పథం కలిగి ఉండాలి. భావోద్వేగాలకు దూరంగా ఉండాలి. ఫలితాలతో సంబంధం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాస్తే లక్ష్యం చేరుకుంటారు.

– డాక్టర్, సునీల్‌కుమార్, మానసిక వైద్యనిపుణుడు

పుస్తకాన్ని సరైన ఎత్తులో ఉంచి చదవాలి



మెడ, నరాల నొప్పి రాకుండా ఉండేందుకు విద్యార్థులు పుస్తకాలను సరైనా ఎత్తులో పెట్టి చదువుకోవాలి. ఒత్తిడికి లోనుకావద్దు. ఎక్కువ సేపు చదవడం, నిద్రలేమి కారణాలతో ఆరోగ్యం దెబ్బతింటుంది. మొబైల్ అతి వినియోగం మానుకోవాలి. చదువు మధ్యలో షార్ట్ బ్రేక్ ఇవ్వాలి. రోజూ వాకింగ్, వ్యాయామం చేయాలి. పుస్తకాన్ని తలకు సరైన ఎత్తులో పెట్టుకుని చదువుకోవాలి. సరైన నీరు, పోషకాహారం తీసుకోవాలి.

– వీ అరుణ్‌శేషు, న్యూరాలజిస్ట్, మంచిర్యాల

ప్రశాంతంగా చదువుకోవాలి



పరీక్షలు ఏవైనా విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునేలా తల్లిదండ్రులు సహకరించాలి. పరీక్షల సమయంలో స్నాక్స్, రాగిజావ అందించాలి. ఒత్తిడికి గురైతే చదివింది కూడా మరిచిపోయే అవకాశం ఉంటుంది. ఇతర పిల్లలతో తమ పిల్లలను పోల్చడం మానుకోవాలి. విద్యార్థులకు పరీక్షలప్పుడు ఏమి కావాలో తెలుసుకుంటూ వాళ్ల అవసరాలను తీరుస్తుండాలి.

– బండి మధుకర్, పేరెంట్, పొక్కూర్

మందమర్రి ఏరియా జీఎంగా మోహన్‌రెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఇద్దరు జీఎంలను బదిలీ చేస్తూ జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) ఏ.కుమార్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్జీ–1 ఏరియా జీఎం కలువల నారాయణ ఉద్యోగ విరమణ పొందడంతో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్‌గా చింతల శ్రీనివాస్‌ను ఆర్జీ–1 ఏరియా జీఎంగా బదిలీ చేశారు. అలాగే, ఆర్జీ–ఓసీ–3లో ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న జి.మోహన్‌రెడ్డిని పదోన్నతిపై మందమర్రి ఏరియా జీఎంగా నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని ఈజ్‌గాం గ్రామానికి చెందిన అనాత్‌దాస్ (58) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అనాత్‌దాస్ కొద్దికాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 30న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. విలేజ్ నంబర్–13లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు షానుదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలు కిందపడి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక భగవంతంవాడకు చెందిన తోట రాయలింగు (66) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రోజులాగే శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన రాయలింగు తిరిగి సాయంత్రమైనా ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఈక్రమంలో మంచిర్యాల శివారులో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే అధికారుల నుంచి సమాచారం అందగా వారు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. మృతుడి కుమారుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

'కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు బీజేపీ కుట్ర'


మాట్లాడుతున్న బలరాంనాయక్, పక్కన ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రతో ప్రజల్లోకి వెళ్తుండడం చూసి అడ్డుకునేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యత్నిస్తోందని, ఇందులో భాగంగానే రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసిందని కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సూరత్ న్యాయస్థానం ఇచ్చిన తీర్పునకు 30 రోజుల గడువు ఉన్నప్పటికీ 24 గంటల్లోపే ఆయనపై బీజేపీ ప్రభుత్వం వేటు వేయడం సరికాదన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడాలని కాంగ్రెస్ నాయకులు కోరినా సోనియాగాంధీ మన్మోహన్ సింగ్‌ను ప్రధానిగా చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ఎంతోమంది అడ్డుపడినా, ఈ ప్రాంత కాంగ్రెస్ నేతలతో సమాలోచనలు చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆమోదం తెలిపారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలోనే సమాచార హక్కు చట్టం, పోడు భూములు, పంటరుణాల మాఫీ, జాతీయ రహదారులు, ప్రభుత్వ ఆసుపత్రుల ఏర్పాటు, ఏకలవ్య, నవోదయ పాఠశాలల ఏర్పాటు తదితర కార్యక్రమాలు, పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, నాయకులు చిట్ల సత్యనారాయణ, కొండ చంద్రశేఖర్, తూముల నరేశ్, హేమలత, వేములపల్లి సంజీవ్, నల్ల మహేశ్, భీమయ్య పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి


ఏవోకు వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు

పాతమంచిర్యాల: ఐకేపీలో పని చేస్తున్న తమను ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏలు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం జిల్లా నాయకురాలు రమాదేవి మాట్లాడారు. 20 ఏళ్లుగా ఐకేపీలో చాలీచాలని గౌరవ వేతనంతో పని చేస్తు మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ సంక్షేమ కార్యక్రమాన్ని ప్రజల్లోకి చేరేలా పని చేస్తున్నామన్నారు. ఇన్ని చేసినా ప్రభుత్వం తమను చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తంజేశారు. కనీస వేతనం ఇవ్వకుండా, ఉద్యోగ భద్రత కల్పించకుండా టార్గెట్ పేరిట మానసిక ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోయారు. విధి నిర్వహణలో తమకు ఏదైన ప్రమాదం జరిగితే పట్టించుకునేవారే లేరని, వేతనాలు పెంచకపోవడంతో తమ కుటుంబాల పోషణ భారంగా మారిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. వీవోఏలు కుంటాల కుమార్, దుర్గం రాములు, వెంకటేశ్, శారద, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రామమందిర్ నిర్మాణానికి 'మహా' కలప


ఆల్లపల్లిలో రామమందిర్ నిర్మాణానికి సిద్ధమవుతున్న కలప

కోటపల్లి: అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిర్ నిర్మాణానికి మహారాష్ట్ర కలపను అధికశాతం వాడుతున్నారు. మహారాష్ట్ర కలప నాణ్యతతో దృఢంగా ఉండడంతో ప్రధాన ద్వారం, కిటికీలు, తలుపుల నిర్మాణానికి వినియోగిస్తున్నారు. మహారాష్ట్రలోని అల్లపల్లి గ్రామంలో ప్రధాన ద్వారాలు, తలుపులు, కిటికీలు తయారు చేస్తున్నట్లు అక్కడి ఫారెస్ట్ అధికారులు తెలిపారు. నియమనిష్ఠలతో తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆశ్రమ పాఠశాలలోకి ఆకతాయిలు

కోటపల్లి: గుర్తు తెలియని వ్యక్తులు గోడ దూకి కోటపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలోకి ప్రవేశించడం కలకలం సృష్టించింది. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే పాఠశాల ఉండగా రెండురోజుల క్రితం ఈ ఘటన జరిగినట్లు తెలిసింది. రాత్రి 11 తర్వాత ప్రవేశించిన వ్యక్తులు తరగతి గది తలుపులు కొట్టగా విద్యార్థినులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వారంతా మూకుమ్మడిగా బయటికి రాగా ఆకతాయిలు పారిపోయారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్థానికంగా ఉండక పోవడం, వాచ్‌మన్ పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో ఆకతాయిలు లోనికి ప్రవేశించినట్లు తెలుస్తోంది. విషయం తెలిసి విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. కోటపల్లి ఎస్సై వెంకట్ పాఠశాలకు వచ్చి విద్యార్థినులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కాగా, పాఠశాలలో ఏర్పాటు చేసిన అత్యాధునిక సీసీ కెమెరాలు రెండేళ్లుగా పనిచేయడం లేదు. మండలకేంద్రంలోనే బాలికల వసతి గృహాలుండగా రాత్రివేళ పోలీసుల పర్యవేక్షణ లేక ఈ ఘటన జరిగినట్లు విమర్శలు వస్తున్నాయి. వీ విషయమై పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణను వివరణ కోరగా.. ఆకతాయిలు వచ్చిన సమయంలో తాను పాఠశాలలో లేనని చెప్పారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు ద్వారా విషయం తెలుసుకుని ఎస్సైకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పురుగులమందు తాగి యువతి ఆత్మహత్య

ఆసిఫాబాద్‌రూరల్: పురుగులమందు తాగి యువతి ఆత్మహత్య చేసుకుంది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతుగూడ గ్రామానికి చెందిన ఇర్దండి శ్రీదేవి (19) శుక్రవారం రాత్రి 9గంటలకు మరుగుదొడ్డిలోకి వెళ్లింది. ఎంతసేపైనా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు వెళ్లి గమనించగా పురుగులమందు తాగి పడి ఉంది. వెంటనే వారు మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు మృతురాలి తండ్రి మనోహర్ పేర్కొన్నారు. కాగా, శ్రీదేవి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

పశువైద్యశాలలో ఆకస్మిక తనిఖీ


పశువైద్యశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న రమేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల ప్రాథమిక పశువైద్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా పశువైద్యాధికారి వై.రమేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం ద్వారా అందించిన సేవలు, టీకాలు, నట్టల నివారణ మందు, గడ్డి విత్తనాల వివరాలకు సంబంధించి రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీపీఆర్ టీకాల కార్యక్రమం త్వరలో ప్రారంభం కానున్నందున జిల్లా స్టోర్స్ నుంచి పీపీఆర్ టీకాలు తెప్పించుకోవాలని సూచించారు. ఆయా మండలాల పరిధిలోని పశువైద్య కేంద్రాల్లో రైతులకు సబ్సిడీపై అందుబాటులో ఉంచిన గడ్డి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవిలో పశువులకు ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. హాజీపూర్ మండల పశువైద్యాధికారి శాంతిరేఖ, ఆఫీస్ సబార్డినేట్ నారాయణ ఉన్నారు.

కాంగ్రెస్ బహిరంగ సభ

ఏర్పాట్ల పరిశీలన


నస్పూర్‌లో సభాస్థలిని పరిశీలిస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

నస్పూర్: హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అసెంబ్లీ ఫ్లోర్‌లీడర్ భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర త్వరలో మంచిర్యాల నియోజకవర్గంలోకి ప్రవేశించనుంది. ఈ సందర్భంగా నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఏప్రిల్ మొదటి వారంలో నిర్వహించనున్న బహిరంగసభ స్థలాన్ని ఏఐసీసీ మాజీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. సభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక నాయకులకు సూచించారు. పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సురిమిల్ల వేణు, పట్టణాధ్యక్షుడు బండారి సుధాకర్, నాయకుడు శీపతి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

భీమారంలో..

భీమారం: మండలంలోని దాంపూర్‌లో శనివారం రాత్రి సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క పర్యటన ఉంటుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథరెడ్డి, సభ్యుడు నూకల రమేశ్ తెలిపారు. శుక్రవారం దాంపూర్‌లో కార్యక్రమం నిర్వహించనున్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యాత్రను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, లక్ష్మణ్, చేగొండ రవి పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న సీహెచ్‌వో

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పలు ఏరియాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలను శుక్రవారం మంచిర్యాల డివిజన్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవల గురించి సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. పలు కేంద్రాల్లో నీటి వసతి లేకపోవడంతో ఉప కేంద్రాలకు వచ్చే వారికి ఇబ్బంది కలుగుతోందని, వసతుల కల్పనకు కృషి చేయాలని సిబ్బంది సూచించారు. సామాజిక ఆరోగ్య అధికారి రామ్మూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, వైద్యాధికారి పద్మశ్రీ, ఏఎన్‌ఎం సంధ్యారాణి, అనిత, జ్యోతి, సీహెచ్‌వో గంగాధర్ ఉన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమశ్‌కోరారు. శుక్రవారం తపస్ సంఘ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎనిమిది సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు, ఐదు సంవత్సరాలుగా బదిలీలు లేవన్నారు. ఉపాధ్యాయుల 12 నెలల పీఆర్సీ ఎరియర్స్‌కు సంబంధించి ఇంతవరకు మూడు నెలలు మాత్రమే క్రెడిట్ అయ్యాయని, మిగతా 9 నెలల ఎరియర్స్ జమకాలేదన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు సంవత్సరం తరబడి విడుదల కాలేదన్నారు. చివరకు పెన్షనర్ల రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్‌లో జాప్యం జరుగుతోందని తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, రవికుమార్, జిల్లా బాధ్యులు నీలేశ్‌కుమార్, రాజ్‌కుమార్, రమణయ్య, సత్తిరెడ్డి, రూపాచారి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.